

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట

# జడ్చర్లకు బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేయండి..!

**- ముస్లింలకు ఖబరస్తాన్ ఏర్పాటు చేయాలి - ఉదండాపూర్ నిర్వాసితులను పరిహారం పెంచాలి**

**- అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**



**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి16, ప్రభాతవార్త:** జడ్చర్లకు ఇటు మహబూబ్‌నగర్, నారాయణపేట, అటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు వెళ్లాలనుకు న్నా పట్టణంగుండా వెళ్లాలని చాలాట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అసెంబ్లీలో జడ్చర్లఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లేవనెత్తారు. జడ్చర్లకు కుడి, ఎడమ వైపును కలుపుతూ ఒక బైపాస్‌రోడ్డు ఏర్పాటుచేయాలని కోరారు. బైపాస్ రోడ్డు పట్టణంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు తప్పుతాయన్నారు. జడ్చర్ల పట్టణ ముస్లిం సోదరులకు ఖబరస్థాన్ లేదని, 3ఎకరాల్లో ఏర్పాటు చేసేలా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఎకరాకు రూ.15లక్షలు కేటాయించిన ప్రభుత్వం జడ్చర్ల పరిధిలోని ఉదండాపూర్ భూనిర్వాసితులకు రూ.5లక్షలు కేటాయించిందని ఎమ్మెల్యే లేవనెత్తారు. ఉదండాపూర్ నిర్వాసితులకు గత ప్రభుత్వ మోసం చేసిందని భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచాలని కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపథకం నుంచి 9మోటార్లకు ఒక్కటే ప్రారంభించి అది కూడా నడిపి తర్వాత ఒక్క చుక్క నీరు కూడా విడుదల కాలేదన్నారు. ఉదండాపూర్ కుడి, ఎడమ కాలువ కనీసం ప్రారంభించలేదన్నారు. లక్ష్మీదేవిపల్లి ఇంకా ప్రారంభించలేదన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో అలసత్వం ప్రదర్శించిందన్నారు.

# ప్రతి ఇంటికి గృహజ్యోతి..!



**- 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు చర్యలు**

**- మీటర్‌కు రేషన్ కార్డు లింక్ చేస్తున్న బిల్ రీడర్లు**

**- మహబూబ్‌నగర్ జిల్లాలో 2,39,370కుటుంబాలకు రేషన్ కార్డులు**

**- ఇప్పటికీ లక్షా20వేలకుపైగా రేషన్‌కార్డుల అనుసంధానం**

**- అద్దెకున్న వారికి సైతం వర్తింపు**

**- రేషన్‌కార్డు హోల్డర్లు సద్వినియోగం చేసుకోవాలి**

**- పథకం నిరంతర ప్రక్రియః ఎస్‌ఈ వేముల ప్రభాకర్**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి 16, ప్రభాత వార్త:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెర వేర్చేందుకు అడుగులు వేస్తున్నది. ఈమేరకు యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, కుటుంబానికి రాజీవ్ భీమా పథకం ప్రారంభించగా గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా బిల్ మీటర్ రీడర్లు మీటర్ నెంబర్‌కు రేషన్ కార్డును అనుసంధానం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 2.39లక్షల రేషన్‌కార్డులు ఉండగా దాదాపు 85శాతం మంది 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నట్లు గత యేడాది లెక్క ఆధారంగా తెలుస్తున్నది. ఇప్పటికే లక్షా 20వేలకు పైగా మీటర్ నెంబర్లకు ఆధార్, రేషన్ కార్డులను అనుసంధానం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



ఇంటి విద్యుత్ మీటరుకు
రేషన్ కార్డు అనుసంధానం చేస్తున్న సిబ్బంది

**రేషన్ కార్డు లింక్ తప్పనిసరి..**

- ఉచిత విద్యుత్ పథకానికి తెల్లరేషన్ కార్డు తప్పనిసరి
- 200యూనిట్ల పథకం అమలు కావలంటే లబ్దిదారులు తమ ఇంటి విద్యుత్ మీటరుకు రేషన్ కార్డు అనుసంధానం చేయించాలి. ఈమేరకు ఇప్పటికే బిల్ రీడర్లు మీటర్లకు రేషన్ కార్డును అనుసంధానం చేస్తున్నారు.
- బిల్ రీడర్లు ఇంటికి వచ్చినప్పుడు తమ రేషన్ కార్డును చూయించి మీటరుకు లింగ్ చేయించాలి.
- ఒక ఇంటికి ఒకే మీటరుకు రేషన్ కార్డును లింక్ చేస్తారు. ఒకే ఇంట్లో ఒకరిపైనే రెండు మీటర్లు ఉన్నా ఒక్క మీటరుకే అనుసంధానం చేస్తారు. కమర్షియల్ మీటర్ ఉంటే పథకం వర్తించదు. ఒకటి డొమెస్టిక్, కమర్షియల్ రెండు ఉంటే డొమెస్టిక్ మీటరురీడింగ్ 200 యూనిట్లలోపు ఉంటే పథకం వర్తిస్తుంది.
- అద్దెకున్న వారికి సైతం పథకం వర్తిసుంది.
- ఒక వేళ మీటరు రీడర్లు వచ్చినప్పుడు సమయానికి ఇంట్లో లేకుంటే తర్వాత అయినా లబ్ధిదారులు కరెంట్ బిల్, మీటరు నెంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని ఏఈ కార్యాలయానికి వెళ్తే అక్కడ అనుసంధానం చేస్తారు.
- పథకం అమలుకు ఎలాంటి సమయం నిబంధన లేదు. ఇది నిరంతర ప్రక్రియ.

**గృహలక్ష్మీ నిరంతర ప్రక్రియ..**

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం దాదాపు 85శాతం మందికి వర్తించనున్నది. 2022-23 డాటా ఆధారంగా బిల్ రీడర్లు ప్రతి ఇంటికి వెళ్లి రేషన్ కార్డు, ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారికి సైతం పథకం వర్తిస్తుంది. తెల్ల రేషన్ కార్డు అయితే తప్పనిసరి. ఒకవేళ మీటర్ రీడర్లు ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో లబ్ధిదారులు లేకుంటే తర్వాత స్థానిక ఏఈ కార్యాలయానికి వచ్చి రేషన్ కార్డుచ మీటరు నెంబర్, ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవచ్చు. ఇది నిరతరంగా కొనసాగుతూనే ఉంటుంది. ఎలాంటి టైం బాండ్ లేదు. 200యూనిట్లలోపు వినియోగదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

**- వేముల ప్రభాకర్,**
**ఎస్‌ఈ, నారాయాణపేట,**
**మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి**

## 20 రౌండ్లు... 20 శునకాలు..!

**అర్ధరాత్రి కుక్కలపై కాల్పులు.. టార్గెట్ వ్యక్తులా.. కుక్కలా**

**భయాందోళనలో పొన్నకల్ గ్రామస్తులు**

**ఎవరు చేశారనే కోణంలో పోలీసుల దర్యాప్తు**



కుక్కలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిబ్బంది

**మహబూబ్‌నగర్/ అడ్డాకుల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలపై గన్నుతో కాల్పులు జరిపిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోకి కార్లో నలుగురు వ్యక్తులు వచ్చి వీధి వెంబడి మొరుగుతున్న కుక్కలను ఫైర్‌చేస్తూ కాల్చుకుంటూ 20 కుక్కలను 20 రౌండ్లలో హతమార్చారు. ఇంకొన్ని కుక్కలు గాయపడ్డాయి. ఈ సంఘటన జరుగుతున్నసమయంలో నిద్రిస్తున్నందున గ్రామస్తులు కాల్పులకు భయపడి ఉలిక్కిపడ్డారు. ఇంట్లోకి పోయి జాగ్రత్తపడ్డారు. శుక్రవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి రాజవర్ధన్ రెడ్డి కారులో నలుగురు వ్యక్తులు ఉన్నారని, కారు నంబర్ గుర్తు పట్టలేకపోయినట్లు తెలిపారు. ఈ మేరకు సిఐ శ్రీ రామకృష్ణ, ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని భయభ్రాంతులకు గురైన గ్రామస్తులకు ధైర్యం చెబుతూ చనిపోయిన కుక్కలను ఊర చివర వెటర్నరీ డా. రాజేష్‌ఖన్నా పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కాల్పులు ఎవరు జరిపింది, ఎందుకు వాటిని చంపాల్సి అవసరమేముందనే కోణంలో పూర్తి వివరాలు దర్యాప్తు చేసి చెబుతామని సిఐ రామకృష్ణ, ఎస్సై శ్రీనివాసులు వెల్లడించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ
రామకృష్ణ, ఎస్సై శ్రీనివాసులు

## నల్లమల్ల టైగర్ రిజర్వ్ గ్రామ తరలింపు పునరావాసాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దాలి

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతాల్లోని సార్లపల్లి గ్రామ తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఒత్తిడి లేకుండా గ్రామ సభలో తీర్మానించి సుముఖతం వ్యక్తం చేసిన 186కుటుంబాల పునరావాసానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ అధ్యక్షతన అదనపుకలెక్టర్లు కుమార్ దీపక్, కే.సీతారామారావు, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, అమ్రాబాద్ కోర్ ఏరియాలో నివసించే గ్రామ వాసుల కోసం స్వచ్ఛంద గ్రామ పునరావసం కోసం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టైగర్ రిజర్వు ప్రాంతం నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు ముందుకొచ్చి ప్రతిపాదించిన సార్లపల్లి గ్రామ పునరావాసం ఒక మోడల్‌గా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకొంటూ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. టైగర్ రిజర్వ్ నుంచి గ్రామ తరలింపు పురోగతి పనులపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సార్లపల్లి గ్రామంలో 186 కుటుంబాలను గుర్తించగా అందులో 85 కుటుంబాలు రూ.15లక్షల పరిహారం తీసుకొనున్నట్లు వారు గ్రామ సభలో వెల్లడించారని, మిగిలిన 101 కుటుంబాలకు బాకారం సమీపంలో ఒక్కొ కుటుంబానికి 220 గజాల ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయింపుతో పాటు వ్యవసాయ జీవనోపాధికై ప్రతి కుటుంబానికి 5 ఎకరాల వ్యవసాయ భూమిని అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటి స్థలం కోసం కేటాయించిన ప్రాంతాభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి చేయాలన్నారు. అందుకు కావాల్సిన నిధులు, అటవీశాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని, పునరావాసం కోసం కేటాయించిన ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాలకై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సార్లపల్లి గ్రామవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న
జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## ఆవిష్కరణలు ఉపయోగం..!

**వన్‌డే వన్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన కలెక్టర్**

**శిల్పారామంలో 30మంది ఆవిష్కర్తల ఆవిష్కరణల ప్రదర్శన**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి16 ప్రభాతవార్త :** రైతులకు ఆవిష్కరణల ఆవిష్కర్తలు, రైతుల మధ్య సంబంధాలు పెంపొందించుకో వడానికి వన్డే వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేం ద్రం శిల్పారామంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టిఎస్ఐసి), నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్‌డే వన్ ఎగ్జిబిషన్ కార్యక్ర మాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ఐసి నాబార్డు సంయుక్తంగా ఏర్పాటు చేసిన వన్ డే వన్ ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన అభినందించారు. క్షేత్రస్థాయి ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. రైతులకు అండగా నిలిచే ప్రత్యేక కార్యక్రమమని చెప్పారు. వ్యవసాయం, నీటి వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణ సంఘాలను మెరుగుపరచడానికి మార్గాలను కనుగొన్న 30 మంది ఆవిష్కర్తల నుండి వారి కొత్త ఆలోచనలను ప్రదర్శనలను వీక్షించినట్లు చెప్పారు. ఈ ఆలోచనలు రైతులకు మార్పును కలిగిస్తాయని, సంచలనాత్మక పరిష్కారాల అమలు, వినియోగాలను సులభతరం చేస్తుందని చెప్పారు. గ్రామీణస్థాయి ఆవిష్కరణలకు మార్కెట్‌ను ఏర్పాటు చేయడంలో ఒక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుందని చెప్పారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణల కోసం మార్కెట్‌ను సృష్టించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలు ఆవిష్కర్తలు, లబ్ధిదారుల మధ్య విలువైన సంబంధాలను సులభతరం చేయటమే కాక, రైతులు, స్థానిక సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను స్వీకరించి అమలు చేయడంపై చర్యలను ప్రోత్సహిస్తాయని చెప్పారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో వినూత్న పరిష్కారాల విస్తరణ, రైతులు, స్థానిక కార్మికులకు శారీరక శ్రమను తగ్గించడం, తక్కువ ధర స్థిరమైన పరిష్కారాలపై అవగాహన పెరగడం, 30మంది భాగస్వామ్య ఆవిష్కర్తలకు కొత్త మార్కెట్ యాక్సెస్, వ్యాపార అవకాశాలు వంటివి ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా ఫలితాల సాధనకు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమానికి 750మందికి పైగా రైతులు, ప్రజలు ఆసక్తి కలిగిన వ్యక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం షణ్ముఖచారి, ఎడిఎం అచల్‌పున్నా, టిఎస్ఐసి (లీడ్ ఫర్ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్) సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరణలను తిలకిస్తున్న కలెక్టర్ రవినాయక్

## ఎస్‌డిపిఓగా బాధ్యతలు తీసుకున్న డీఎస్పీ..

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** నారాయణపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా డిఎస్పీ ఎన్. లింగయ్య శుక్రవారం సాయంత్రం పదవి బాధ్యతలు తీసుకున్నారు. ఇతను ఇంతకు ముందు సిఐడి డీఎస్పీ హైదరాబాద్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు రావడం జరిగింది. ఇంతకు ముందు డీఎస్పీగా విధులు నిర్వహించిన కె.సత్యనారాయణ జోగులాంబ గద్వాల జిల్లా డీఎస్పీగా బదిలీ అయ్యారు. అనంతరం నూతన డీఎస్పీ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను ఎస్పీ కార్యాలయంలో కలిస పూలమొక్క అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి జిల్లా పరిధిలో - మిగతా2లో..



## రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేద్దాం

**బిజెపి కేంద్ర ప్రభుత్వ మతోన్మాద**

**కార్పోరేట్ విధానాలపై కార్మికులు కన్నెర్ర చేయాలి**

**ఏఐటీయూసీ, సీఐటీయూ ఇఫ్టు కార్మిక సంఘాల పిలుపు**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బందన సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని నల్లకుంట రాజీవ్ మార్గ్ పాత బస్టాండ్ తీరుమైదన్ నుండి గాంధీచౌక్ వైయస్సార్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ దాక ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఉప్పేరుకృష్ణ మాట్లాడారు. దేశంలో పదేళ్ల నుండి బిజెపి నరేంద్రమోడీ ప్రభుత్వం 60శాతం అసంఘటిత రంగం సేవా రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం తమ శ్రమ ద్వారా సంపాదనను సృష్టిస్తున్నారని కాని మరొపక్క భారతదేశం వ్యవసాయ రంగంపై సుమారు 70శాతం ఆధారపడినటువంటి సందర్భం ఉన్నది కానీ కేంద్రప్రభుత్వం కార్మికులు రైతులు వ్యవసాయకూలీల పట్ల ఇప్పటివరకు ప్రభుత్వం కనీసం వారి యొక్క సమస్యల పరిష్కారం కొరకు వారి ఆర్థిక సామాజిక స్థితిగతుల కొరకు ప్రయత్నం చేయలేదని పోగా దేశంలో చిన్న సన్నకారు రైతులు 80 శాతం ఉన్నారని రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వ్యవసాయం పండుగ చేస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రగడ్బాల్ పలికి వ్యవసాయని సంక్షోభంలోకి నెట్టి రైతాంగాని భూముల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తుందని గిట్టుబాటు మద్దతు ధర చట్టం చేయాలని రైతులు పోరాటం చేస్తుంటే వారి పై పోలీసులను పెట్టి లాఠీలతో దాడి చేస్తుందని గ్రామీణ ప్రాంతంలోని కూలీలకు ఉపాధి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి నిధులు పెంచాల్సింది. పోయి నిర్వీర్యం చేస్తుందని దేశంలో ధరలు నిత్యవసర వస్తువులు పెట్రోలు డీజీలు వంటగ్యాస్ ఇతర ధరలు విపరీతంగా పెంచి సామాన్య ప్రజల మీద భారాల మోపుతుందని ఇంకోపక్క దేశంలో ఉన్న సంపదను వనరులను ఖనిజ సంపదను అడవి సంపదను వనరులను ఖనిజ సంపదను అడవిసంపదను ఈ దేశం నుండి పెట్టుబడుదారులకు బడ బురుజువాలకు దోచిపెడుతుందని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న కార్మిక వర్గానికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ ఇతర సమస్యల పరిష్కారం కొరకు పోరాటం చేస్తే దాడులు చేస్తుందని రెండో పక్క ప్రభుత్వ రంగ సంస్థలను రైల్లో ఇన్సూరెన్సు బ్యాంకింగ్ బొగ్గు గనులు ఓడరేవులు విమానాలు విద్యుత్తు రోడ్డు మార్గాలు తదితర సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల కట్టబెడుతుందని కారుచౌకగా దేశంలో ప్రతి ఏటా రెండో కోట్ల ఉద్యోగ కల్పన కల్పిస్తామని మాటలు చెప్పి నిరుద్యోగ వ్యవస్థను తారస్థాయికి చేసిందని ప్రశ్నించే వ్యక్తులపైన ప్రజాస్వామ్య వాదుల పైన దేశద్రోహం పేరు మీద కేసులు పెట్టి జైలుకు పంపుతుందని రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తుందని భారతరాజ్యాంగాన్ని లౌకికవాదాన్ని పౌరస్వేచ్ఛను లేకుండా చేస్తుందని కార్మిక చట్టాలను కోడులుగా మార్చి కార్మిక వర్గానికి బానిసలు చేస్తుందని మహిళలపై దాడులు హత్యలు అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని వీటన్నింటి మీద పోరాడుతున్న వ్యక్తుల పైన సంఘాలపైన అక్రమ కేసులు పెడుతుందని మతం పేరు మీద జాతీయ భవాల పేరుమీద ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని రాబోయే భవిష్యత్తులో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు ఐక్య ఉద్యమాలతోటి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆశన్న, ఏఎన్ఎం నాయకురాలు పద్మ, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ప్రవీణ్, ఏఐటీయూసీ హమాలీ నాయకులు నాగరాజు, రాజు, పరుశరామ్, కర్రెప్ప, రవి, మస్తాన్, వెంకట్రాములు, సీఐటియు నాయకులు డ్యాం అంజి, వి గట్టన్న, వెంకటేశం, సీతారాములు, పద్మకాంతమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు జమ్మిచెడి కార్తీక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.





అంబేద్కర్ చౌక్ దాక ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## బిజెపి హటావో దేశ్‌కి బచావో.. కదం తొక్కిన కార్మిక సంఘాలు..

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శనగా తెలంగాణ చౌరస్తాలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. దీనికి సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, విజయ్‌బాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, టిఎన్‌టియుసి జిల్లా నాయకులు ధన్వాడ రాములు మద్దతు పలికి అనంతరం మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు కష్టజీవులకు కష్టాలు కడగండ్లు మిగిలాయని, కార్మిక హక్కులను హరించడం, పనిగంటలు పెంచడం, కార్మికచట్టాలను కార్పోరేట్లకు యాజమాన్యాలకు పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చడం కనీస వేతనాలు, పెన్షన్ అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పోరేట్లకు వంతపాడి కష్టజీవుల సంపదను దోచిపెడుతున్నాయని ఆరోపించారు. మోడీ పాలనలో పెట్టుబడిదారులు కార్పోరేట్లకు లాభాలు చేకూర్చడం తప్ప కార్మికులు, కష్టజీవులు, రైతులు వ్యవసాయ కూలీలకు కడగండ్లు మిగిలాయని పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిపై దేశద్రోహ చట్టం మోపడం తదితర నిరంకుశ విధానాలను మోడీ ప్రభుత్వ అవలంబించిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పోరేట్లకు లాభాలు చేకూర్చి, దేశ సంపదను కొందరి చేతుల్లో పెట్టాడని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో మోడీని గద్దెదించి భారతదేశాన్ని రక్షించుకోవాలని వారు కార్మికులకు, రైతులకు పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా యుబిఐ బ్యాంక్ అసోసియేషన్ నాయకులు జెట్టి రాజేష్, తిరుమల్‌రెడ్డి మద్దతుగా ప్రసంగించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎర్ర నరసింహులు, ప్రభాకర్, భవన నిర్మాణకార్మిక సంఘంజిల్లా అధ్యక్షులు వరదగాలన్న, ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముక్తార్‌ఖాన్, టైల్స్ అండ్‌గ్రానైట్స్ వర్కర్స్‌యూనియన్ నాయకులు రవినాయక్, బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్ నాయకులు - మిగతా2లో..





నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

## చిక్కని చిరుత ఆందోళనలో అన్నదాతలు..

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** చిరుత పులిని బంధించడానికి అటవీశాఖ అధికారులు బోన్ ఏర్పాటు చేసి 15 రోజులు గడుస్తున్న చిరుత పులి చిక్కకపోవడంతో వ్యవసాయ కులాల దగ్గరకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు గత వారం రోజులుగా మండల కేంద్రం చుట్టుపక్కల వ్యవసాయ పొలాల దగ్గర చిరుత పులిని చూసినట్లు వ్యవసాయ పొలాల రైతులు తెలియజేశారు. వారం రోజుల క్రితం వనపర్తి రోడ్డు సమీపంలో ఉన్న రైతు పశువుల పాకలో చిరుత పులి దూడ పై దాడి చేసిన సంఘటన మరువకముందే ఈనెల 13వ తేదీన ఘణపురం నుండి పర్వతాపూర్ వెళ్లే దారిలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో జింక పిల్లపై దాడి చేసి తల భాగాన్ని ఎత్తుకుపోయింది మండల కేంద్రం చుట్టూ 400 పై ఎకరాల్లో గుట్టలు వ్యాపించి ఉన్నాయి అటవీశాఖ అధికారులు గుట్టల ప్రాంతాల్లో నలదిక్కల బోన్లను ఏర్పాటు చేసి వెంటనే చిరుత పులిని బంధించాలని అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.



జింకను చంపిన చిరుతపులి

## విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యను అందించాలి

**ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసిన జడ్పీ చైర్మన్**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుచున్న విద్యార్థులతో కలిసి కొంతసేపు ఉపాధ్యాయురాలిగా సరిత బోధించి, పాఠ్యాంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకుని, ఉపాధ్యాయులు విద్య బోధన ఏవిధంగా బోధిస్తున్నారని తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం జెడ్పిచైర్ పర్సన్ సరితమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులకు సరిత సూచించారు. ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపోందించే విధంగా కృషి చేయాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతిలో అవకతవకలు లేకుండా, నాణ్యమైన భోజనం మెను ప్రకారం అందించాలని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బాధ్యత రహితంగా వ్యవహరించాలని జెడ్పిచైర్‌పర్సన్ సరితమ్మ ఉపాధ్యాయులకు ఆదేశించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అమరవాయి కృష్ణారెడ్డి, తుమ్మలనరసింహులు, డిటిడిసి నరసింహులు, భాస్కర్‌యాదవ్, పులిపాటి వెంకటేష్, జమ్మిచేడు ఆనంద్, పాతపాలెం ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, సద్దనోములపల్లి గోపాల్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం
చేస్తున్న జెడ్పిచైర్ పర్సన్ సరితమ్మ



వంటకాలను పరిశీలిస్తున్న జడ్పిచైర్‌పర్సన్ సరితమ్మ

## ఢిల్లీకి వెళ్లిన బిజెపి ఉమ్మడి జిల్లా నాయకులు

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** ఢిల్లీలో జరగనున్న బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశాలలో పాల్గొనడానికి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ తో కలిసి వెళ్తున్న బిజెపి రాష్ట్ర కోశాధికారి బి.శాంతి కుమార్, గద్వాల వెంకటాద్రి రెడ్డి, అయ్యపు రెడ్డిలు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. 18వ తేది వరకు ఈ సమావేశాలు జరుగతాయని శాంతికుమార్ తెలిపారు. 19వ తేదిన బిజెపి జాతీయ కోశాధికారుల సమావేశం అనంతరం తిరుగు ప్రయాణం అవుతామని ఆయన తెలిపారు.

## గద్వాల బల్దీయాలో డైలీ డ్రైవర్లను తొలగించడం భాధకరం

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** గద్వాల మున్సిపల్ పరిధిలో ప్రతి రోజు వార్డులలో చెత్త సేకరిస్తున్న 40 మంది డైలీ డ్రైవర్లను తొలగించడం బాధకరమని బిజెపి కౌన్సిలర్ త్యాగరాజు అన్నారు. ఇప్పుడు కౌన్సిలర్‌లకు తెలియకుండానే చెత్త సేకరణ ప్రైవేటీ ఏజెన్సీ వాళ్లకు ఇచ్చారని, చెత్తసేకరణ వాళ్ల పిల్లలు ఎత్తుకపోయే, గొంతుకోసే వాళ్లలా ఉన్నారని దీంతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని కౌన్సిలరన త్యాగరాజు సభాదృష్టికి తీసుకెళ్లారు. తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**ఖిల్లా ఘనపురం ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శివకుమార్ 18 సం.లు గాలిపటం ఎగురవేస్తుండగా ఇంటి వెనకాల ఉన్న చెట్టుకొమ్మకు తగులు తుంది. చెట్టు పైకి ఎక్కి గాలిపటాన్ని తీస్తుండగా చెట్టు పైనుండి ఉన్న విద్యుత్ తీగలను గుర్తించకపోవడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

## డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ డీఎస్పీగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఎస్పీ హర్షవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మర్యాదపూర్వకంగా ఎస్పీకి మొక్క అందజశారు.

## డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ప్రొఫెసర్ జైపాల్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి16, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వ విద్యాలయంలోని పీజీ కళాశాలలో ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జైపాల్‌రెడ్డిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా నిరమిస్తూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఉత్తర్వుల కాపీని జైపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన వీసీకి ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, పీఆర్‌వో రవికుమార్ ఉన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలి

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు దేవదానం మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ తీసుకొచ్చినకార్మిక, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు సమ్మె చేపడుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వ రైతాంగ సంక్షేమంకై కృషి చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కోళ్ల వెంకటన్న, ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ.కొండన్న, అరుణోదయ జిల్లాఅధ్యక్షులు చంద్రన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు వెంకటేష్‌గౌడ్, జీపి సంఘం మండల అధ్యక్షులు కె. కురుమన్న, భవన నిర్మాణ సంగం నాయకులు రాజు, గ్రామ పంచాయతీ, బీడీ, భవన నిర్మాణ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

## పేట ఎక్సైజ్ నూతన సిఐగా అశోక్‌కుమార్

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** జిల్లా ఎక్సైజ్ నూతన సిఐ ఎం.అశోక్‌కుమార్ శుక్రవారంమధ్యాహ్నం జిల్లాఎస్పీ యోగేష్ గౌతమ్‌కు పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ అశోక్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సిఐతో పాటు ఎక్సైజ్ ఎస్సై సందీప్ ఉన్నారు.

## ఈకెవైసి నెలాఖరుకు పూర్తిచేయాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** జిల్లాలో ఆహార భద్రత కార్డుల ఈకెవైసి యూనిట్ల నమోదు ఈ నెలాఖరులోగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాలో ఆహార భద్రత కార్డుల ఈకెవైసి యూనిట్ల సేకరణపై సమావేశాన్ని చౌకధర దుకాణాల డీలర్‌ల ప్రతినిధులతో, పౌర సరఫరాల అధికారులతో ఐడిఓసిలో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుతానికి, ఈకెవైసి నమోదులో రాష్ట్ర సగటు 75 శాతం కంటే తక్కువగా, జిల్లాలో ఈపిఓఎస్‌లో ఆహార భద్రతా కార్డు యూనిట్ల ఈకెవైసి యొక్క 65 శాతం నమోదు పూర్తయిందని తెలిపారు. చౌకధర దుకాణం డీలర్లు ఫిర్యాదులకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా సాధారణ దుకాణ పనితీరు సమయాలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్డుదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కెటిదొడ్డి, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** మండల పరిధిలో శుక్రవారం ఉదయం 11 గం.ల సమయంలో చింతలకుంట గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా రాయిచూరు జిల్లా మురికిదొడ్డి గ్రామం నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కెటిదొడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. మురికిదొడ్డి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని నర్సింహులు డైవర్ దుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఇసుక అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె

**జడ్చర్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** దేశవ్యాప్త సమ్మెలో గ్రామీణ బంద్‌లో భాగంగా జడ్చర్ల స్థానిక డా.బిఆర్ అంబేద్కర్ భవనం ఆవరణలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య అధ్యక్షతన సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెలో సిఐటియ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వం అధికంలోకి వచ్చి దాదాపుపది సంవత్సరాలుపూర్తి చేసుకుంది కాని పేదలు , సంఘటిత కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కర్షకుల మీద ఎక్కడకూడా చిల్లిగవ్వంత ప్రేమ చూపించకపోగా బడా పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విమానయానం, రైల్వే, షిప్‌యార్డ్స్, ఎయిర్ పోర్ట్స్, తపానా, టెలిఫోన్ ఎక్స్చేంజ్, ఇన్సూరెన్స్ ఇలా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్, సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు భాగి కృష్ణయ్య, వసియాబేగం, ఎండి మున్నా, ఎల్ఐసి అధ్యక్షులు శ్రీనివాస్, అంగన్‌వాడి యూనియన్ అధ్యక్షురాలు సరోజ, రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్లు, యూనియన్ నాయకురాలు నరసమ్మ, సునిత, మయూరి, నసీమా, గ్రామపంచాయతీ కార్మికులు ఎండిపాషా, చెన్నయ్య, శ్రీనివాసులు, విఓఎ సంఘం అలివేల, రమాదేవి, అరుణ పాల్గొన్నారు.

**పానగల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా శుక్రవారం మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే శ్రీరామ్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వటం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తున్నారని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పరిధినాన్ని 12 గంటలకు పెంచటం పరికాదన్నారు. ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, నాయకులు కాకం కాశన్న, కుర్వ హనుమంతు, కాకం చిన్నరాముడు, హుస్సేన్, వేమన్న, వెంకటయ్య, బాలస్వామి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సమన్వయంతో కృషి చేయాలి

● నారాయణపేట జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వనజమ్మ






సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ వనజమ్మ, హాజరైన అధికారులు

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారిలో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరయ్యారు. ఛైర్‌పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా చూడాలన్నారు. సమావేశంలో పలువురు జడ్పీటిసిలు, ఎంపిపిలు తమ తమ మండలాల పరిధిలోని సమస్యను ప్రస్తావించారు. ఉట్కూర్ జడ్పీటిసి సభ్యులు అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోఇంకా కొంతమంది రైతులకు రైతుబంధు నగదు జమ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్‌ను ప్రశ్నించగా ఈ నెలాఖరు వరకు రైతుబంధ సాయం రైతుల ఖాతాల్లో జమవుతుందని జాన్ సుధాకర్ తెలిపారు. రైతుబంధు సాయం ఎన్ని ఎకరాల వరకు కట్‌చేసే అవకాశం ఉందనికో ఆప్షన్ సభ్యులు తాజుద్దిన్ అడగగా ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందిస్తుందని, ప్రస్తుతానికి గత సీజన్‌లో మాదిరిగానే రైతులకు నగదు సాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుందని జాన్ సుధాకర్ తెలిపారు. దామరగిద్ద ఎంపిపి బక్క నరసప్ప మాట్లాడుతూ దామరగిద్దలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్నారని తీగల కింద కాకుండా వాటి పక్కలో మొక్కలు నాటాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయే గృహజ్యోతి పథకానికి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఏదైనా రేషన్‌కార్డు కలిగిన వినియోగదారులు అర్హులని, ఇప్పటికే లక్ష మందిలో 65 వేల మందికి గృహజ్యోతి పథకం అమలు కోసం లింకప్ చేయడం జరిగిందని మిగతావారికి కూడా లింకప్ చేస్తామని చెప్పారు. గృహజ్యోతి ప్రథకాన్ని ప్రతి ఒక్కరికి అమలు చేయాలని జడ్పీటిసి సభ్యులు అశోక్ కోరారు. రేషన్‌కార్డు లేని వారు గృహజ్యోతి పథకానికి అర్హులు కారా అని మాగనూరు జడ్పీటిసి వెంకటయ్య ప్రశ్నించగా, స్పందించిన విద్యుత్‌శాఖ అధికారి గైడెన్స్ ప్రకారం రేషన్‌కార్డు తప్పనిసరి అని రేషన్ కార్డు లేని వాళ్లు కొత్త రేషన్ కార్డువచ్చిన తరువాత గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జడ్పీటిసి సునిత మాట్లాడుతూ చిన్నపిల్లల్లో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని, మండలాల వారిగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గుండెపోటు నివారణపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. దామరగిద్దలో కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవ తీసుకుని నిర్మింపజేసిన ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు కొనసాగించాలన్నారు. చిన్నగాయంతో ఆసుపత్రికి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంజిత్‌కుమార్ వైద్య సేవలు అందిస్తున్నందుకే జిల్లా ఆసుపత్రి పనితీరు రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఆసుపత్రిలో తాము మెరుగైన సేవలందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఉట్కూర్, మక్తల్, మాగనూరు ఎంపిపిలు, తమ మండలాల పరిధిలో తాగునీటి సమస్య నెలకొందని, వేసవికాలంలో సమస్య మరింత జఠిమయ్యే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మద్దూరు జడ్పీటిసి రఘుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో బోర్లు వేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎంపిపిలు, జడ్పీటిసిలు తమ ఈపదవి కాలంలో అభివృద్ధి పనుల విషయంలో జిల్లా అధికారులకు సహకరించారని, జిల్లా అధికారుల తరపున అందరికి శుభాభినందనలు తెలిపారు. ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామ పంచాయతీ వారిగా మిషన్ భగీరథ ఎంట్రీ సిబ్బందితో పనులు చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన రెండోదఫా సమావేశంలో బిసి సంక్షేమశాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా పరిశ్రమలశాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక, గనులు, భూగర్భశాఖ, చేనేత, జౌలిశాఖ, ఉద్యానపట్టు పరిశ్రమల శాఖ, పౌరసరఫరాల శాఖ, దేవాదాయ శాఖ, వెనకబడిన తరగతులు సంక్షేమ శాఖ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తమ తమ పరిధిలోని ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శైలజ, డిప్యూటి సీఈఓ జ్యోతి, ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జడ్పీ కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం: రైతు సంఘం రాష్ట్ర నాయకులు



పాన్‌గల్ లో సమ్మెలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

**పానగల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని రైతు సంఘం రాష్ట్ర నాయకులు కమిటీ జబ్బార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర సిఐటియు మండల కన్వీనర్ సూర్యవంశం రాము అధ్యక్షతన నిర్వహించిన గ్రామీణ బంద్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు కేంద్ర బిజెపి కార్పోరేటు మతతత్వ విధాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్ సీట్ ప్రకటిస్తు లక్షలాది కుటుంబాలను ఇంటింటికి వెళ్లి క్యాంపియన్‌నిర్వహించి. దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చారిత్రాత్మకమైన రైతంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చింది. ఈ కాలంలో వాటిని అమలు చేయక వ్యవసాయ రంగాని కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకున్నది. సహకాం రంగాన్ని నిర్వీరం చేసి కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తున్నది. ఆందోళన సందర్భంగా చనిపోయిన 750 రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. ఉపా చట్టం పేరుతో రైతు నాయకుల పై అక్రమ కేసులుబనాయించి జైళ్ళలలో పెడుతున్నతి. వామపక్షాల ఒత్తిడి వల్ల వచ్చినఉపాధి హామీపథకాన్ని నీరుగారిచేందుకు పునుకుంటున్నదన్నారు. ఏటా 10 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటిని నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఏటా దేశంలో 9కోట్ల ఏకరాల్లోనిపంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టువాడికి 50శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసి చట్టం చేయాలని. పేద మధ్యతరగతి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని. 60 ఏళ్ల పై బడిన అందరికీ పెన్షన్స్ ఇవ్వాలి. నాలుగు లేబర్ కోడ్లన్ రద్దు చేయాలని. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసహరించాలి. కనీస వేతనం 26 వేల రూపాయలు. మరియు పెన్షన్స్ 10000 రూపాయలు అందరికీ చెల్లించాలి. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి. ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించి పని రోజులను 200 పెంచాలి రోజుకు 800 కనీస వేతనం ఇవ్వాలి. రైల్వే రక్షణ విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థలను. పబ్లిక్ సర్వీస్ లను ప్రైవేటీకరణ చేయరాదు. ధరల పెరుగుదలను అరికట్టాలి. ఆహార వస్తువులు, నిత్యవసరంలోపై జిఎస్టిని ఉపసంహరించాలి. పెట్రోల్ డీజిల్ కిరోసిన్ వంటగ్యాస్‌లపై కేంద్ర ఎక్సేంజ్ సుంకం తగ్గించాలి. 14 రకాల నిత్యవసర వస్తువులను అందించాలి. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. డ్రైవర్ల మెడకు ఉపితాడుగా మరిన, హిట్ అండ్ రన్ సెక్షన్ ను 106(1)(2) రద్దుద చేయాలని. ఏమి వి యాక్ట్ 2019 ని సవరణ చేయాలని ప్రభుత్వన్ని కోరారు. 1996 భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికులకు సమగ్ర కేంద్ర చట్టాలను రక్షించాలి. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గంధం భగత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేణు, ఎం వెంకటయ్య, గొర్రెల మేపకదారుల సంఘం డైరెక్టర్ దేవేందర్, ప్రజా సంఘాల మండల కన్వీనర్ జీవెంకటయ్య. రైతు సంఘం జిల్లా నాయకులు జంబులయ్య, సిఐటియు జిల్లానాయకులు బాలకిషన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు శారద, అలివేల, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శ్యామల, మహేశ్వరి, గ్రామపంచాయతీవర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, సుగ్రీవుడు, మాదగిరి, ఐకెపి వివోఎల్ఏ మండల అధ్యక్షులు రాజయ్యగౌడ్, మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు గ్రామపంచాయతీ, ఐకెపి వివోఏలు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించుకుంటాం!

సమ్మెకు మద్దతు తెలిపిన వివిధ ప్రజా సంఘాల నాయకులు



**అలంపూర్ ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** కార్మిక హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించుకు తీరుతామని సమ్మెలో పాల్గొన్న కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సమ్మెలో భాగంగా శుక్రవారం శాంతినగర్ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిఐటియు వడ్డేపల్లి మండల కార్యదర్శి సంజీవరాజు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ మతోన్మాద పోకడలతో రాజ్యాంగ విరుద్దంగా పరిపాలన చేస్తుందని అందుకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు నేటికైనా పరిష్కారానికి కృషి చేయాలని డిమాండు చేశారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్మికులకు వ్యతిరేకంగా చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అన్ని యధావిధిగా అమలు చేయాలని, 26 వేల రూపాయలు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని, పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండు చేశారు. పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలనే డిమాండుతో రైతులు కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఆలోచనలు కేంద్ర ప్రభుత్వం మానుకోని నిధులు పెంచాలని డిమాండు చేశారు. రెండు వందల రోజులకు పనిదినాలు పెంచాలని, 600 రూపాయల కూలి ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి పనిని అమలు చేయాలని డిమాండు చేశారు. అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం తదితర రంగాలలో స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న వారికి పని ఒత్తిడి తగ్గించాలని కనీస వేతనాలు నిర్ణయించాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. గ్రామపంచాయితీ మున్సిపల్ కార్మికులకు పెండింగులో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. పాత కార్మికుల మాదిరి కొత్త కార్మికులకు కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఆటో డ్రైవర్లకు నెలకు4500 రూపాయలు జీవన భృతి ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రమాద బీమా చట్టం చేయాలని డిమాండు చేశారు. ప్రైవేటు మోటారు ట్రాన్స్ పోర్టు రంగంలో పనిచేస్తున్న కారు, జీపు, లారీ, ఆటో తదితరవాహనాల డ్రైవర్ల అందరికి ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, 2019 మోటార్ వాహనాల చట్టం రద్దు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. భవననిర్మాణ రంగంలోని కార్మికులకు పెండింగులో ఉన్న పరిహారాలను మొత్తం వెంటనే ఇవ్వాలని, నిర్మాణరంగ కార్మికుల చట్టాన్ని నిర్వీర్యం చేసే పద్దతులను కేంద్ర ప్రభుత్వం విరమింపచేసుకోవాలని డిమాండు చేశారు. హమాలీ రంగంలోని కార్మికులందరికి సమగ్ర చట్టం చేసి ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్సు సౌకర్యం, ఉపాధి గ్యారెంటీ కల్పించాలని డిమాండు చేశారు. ఈసభలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు తిప్పన్న, యుటిఎఫ్ జిల్లా నాయకులు తిలక్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, సిఐటియు వడ్డేపల్లి మండల కన్వీనర్ సంజీవరాజ్, కో కన్వీనర్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహులు, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, కోశాధికారి శేషన్న, సిఐటియు అమాలి సంఘం సీనియర్ నాయకులు భీమన్న అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు సలోమి, సుమిత్ర, పద్మావతి, వెంకటమ్మ, శివ, శంకరమ్మ, ఆశవర్కర్స్ యూనియన్‌నాయకురాలు మమత, సుజాత, భాగ్యలక్ష్మి, పద్మ, జయమ్మ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు శివన్న, వడ్డేపల్లి, రాజోలి, మానవపాడు, ఇటిక్యాల మండలాలకు సంబంధించిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

● జిల్లా స్థాయి భజన పోటీల విజేతలకు నగదు పంపిణీ

● మండలస్థాయి గోవింద నామ విజేతలకు బహుమతులు అందజేత



**బిజినేపల్లి, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** మాఘరథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాలెం శ్రీ అలివేలు మంగసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భక్తిభావం ఉట్టి పడింది ఆలయంలో ఉదయం నిత్యారాధన, పుణ్యహవచనం, స్వామివారికి ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు కొరవి రామానుజాచార్యులు వేదపండిత అర్చక బృందం విశేషంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో చిన్నారులకు ప్రత్యేకంగా తులాభార కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు తమ చిన్నారుల ఎత్తు స్వామి వారికి బంగారు (బెల్లం) సమర్పించారు. శుక్రవారం జిల్లాస్థాయి భజన మండల పోటీలు భక్తి శ్రద్ధలతో నిర్వహించి, విజేతలకు బహమతులు అందించారు. జిల్లాస్థాయి భజన పోటీల్లో ప్రథమ బహుమతి బిజినేపల్లి ఆనందగిరి భజన మండలి వారికి 8 వేలు, వనపర్తి ఉమామహేశ్వర భజన మండలి ద్వితీయ బహుమతి 6 వేలు, మందాపూర్ గ్రామానికి చెందిన ఉమామహేశ్వర భజన మండలికి తృతీయ బహుమతి రూ. 4 వేలు మాజీ సర్పంచ్ గోవిందు లావణ్య నాగరాజు అందించారు. కన్సోలేషన్ బహుమతులను మహబూబ్‌నగర్ భజన మండలి గురుకుంట భజన మండలి మాజీ ఎంపిటిసి బి.జగన్ అందించారు. మండలస్థాయి గోవిందనామ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమానాలను భవాని, వర్షిత్, శ్రీముచ విద్యార్థులకు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మహబూబ్‌నగర్‌కు చెందిన గురువయ్యాచార్యులు, వెంకటేశ్వర్లు, రాధిక, పవన్, కొంకలి మధులు వ్యవహరించారు. వెంటేశ్వర భాగవతార్‌చే నిర్వహించిన శ్రీనివాస హరి హరికథ భక్తులను అలరించాయి. ఆలయ ఛైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి, ఆలయ ఈఓ సిహెచ్ రంగారావు, కమిటి సభ్యులు సురెందర్, బాలస్వామి, గోపాలస్వామి, గంధం నికిత వెంకటేష్, నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది ఆర్.శివకుమార్, బాబయ్య, శ్రీవారి సేవకులు, జగదీష్, శివ, కొండమ్మ, శేఖర్, రవిందర్‌రెడ్డి, వివిధ ప్రాంతాల నుండి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్ ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** టిఎస్ ఐపాస్ కింద పరిశ్రమల ఏర్పాటుకై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిర్దేశించిన సమయంలో అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమ ప్రోత్సాహక కమిటి, టిఎస్ ఐపాస్, ట్రీ పాయిడ్ సమావేశంలో 2014 టిఎస్ఐ పాస్ చట్టం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చి అన్ని దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా అనుమతులు ఇవ్వాలని చెప్పారు. టీ ప్రైడ్ కింద షెడ్యూల్డు కులాల లబ్దిదారులు సబ్సిడి ప్రోత్సాహంగా ఇచ్చే పథకాలు, అదేవిధంగా షెడ్యూల్డు తెగలు ఇచ్చే పథకాలపై సమీక్ష నిర్వహించారు. టీ ప్రైడ్ కింద షెడ్యూల్డు కులాల లబ్దిదారుల కేటగిరిలో ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కు సంబంధించి ట్రాక్టర్‌లు, ట్రాలీలు, కార్‌లు, గూడ్స్, క్యారేజీలకు ఆరుగురికి 23 లక్షల 61 వేల 868 రూపాయలు సబ్సిడి, ఎస్టీలకు 9మందికి 27లక్షల 77 వేల 597 రూపాయల సబ్సిడి మంజూరుకు కమిటి ఆమోదం తెలిపింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ బావురావు, సంబంధిత అదికారులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలను పరిష్కరించాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్‌రెడ్డి

**వీపనగండ్ల, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణ రైతు సంఘం (ఎఐకెఎస్), సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో బిజెపి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నాడు గ్రామీణ బంధు, మండలంలో మండల కేంద్రం, 8 గ్రామాలలో స్వచ్చందంగా బంధు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలో బస్టాండ్ నుండి గ్రామంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి చౌరస్తాలోసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి బాల్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేటర్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తుందన్నారు. కేంద్రం అశాస్త్రయంగా నిర్ణయించిన కనీసం మద్దతులకంటే తక్కువ అమ్మడం వల్ల ఏటా రైతులు నాలుగు లక్షల కోట్లు నష్టపోతున్నారు. నేటికీ పంటల ప్రణాళిక లేకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడి రాక అప్పులు తీరక ఆత్మహత్యలు పాల్పడుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఎంకృష్ణయ్య, ఆర్‌మౌలాలి, కేవిపిఎస్‌మండల అధ్యక్షులు మురళి, సిఐటియు మండల కన్వీనర్ బాలగౌడ్ నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, ఆశన్న, రాముడు, సుగుణభాయ్, సుజాత, రేణుక, ఈశ్వరయ్య, శ్రీను, అశోక్ రెడ్డి, సత్యం, రైతుసంఘం నాయకులు ఈశ్వర్, ఖాజా హుస్సేన్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రామ కృష్ణ, నవీన్, డీవైఎఫ్ఐ నాయకులు నాగరాజు, పిఎన్ఎం నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

### అక్రమ సంబంధానికి అడ్డు వస్తుందని..

## కూతురును కడతేర్చిన కసాయి తల్లి

● పాప తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



మృతి చెందిన బాలిక జాను



మృతి చెందిన బాలిక జాను (ఫైల్)

**లింగాల, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** అక్రమ సంబంధానికి అడ్డు వస్తుందని ఓ మహిళ తన కన్న కూతురును హతమార్చిన సంఘటన లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన తగిలి తిరుతపయ్య నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డిజె సౌండ్ డెకరేషన్, పెయింటింగ్ పనులు చేస్తూ వారానికి ఒకసారి ఇంటికి వస్తూ జీవనం కొనసగిస్తున్నారు. భార్య మల్లీశ్వరి తన ముగ్గురు పిల్లలతో కలిసి కొత్తకుంటపల్లి గ్రామంలోనివాసం ఉంటున్నారు. భార్య మల్లీశ్వరి గురువారం రాత్రి గ్రామంలో జరిగిన ఒక పుట్టినరోజు వేడుకలకు హాజరైంది. తిరిగి ఇంటికి వచ్చి పాప అక్రమ సంబంధానికి అడ్డు వస్తుందని ఆ పాపను ఎలాగైనాఅడ్డు తొలగించాలనే ఆవేశంతోతాగిన మైకంలో తన రెండవ కూతురు జాను (6)గొంతుపిసికి చంపేసింది. మల్లీశ్వరికి గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో అక్రమ సంబంధం కలిగిఉండి ప్రతిరోజు ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. ఆ విషయాన్ని జాను తన తండ్రికి ఫోన్‌లో చెబుతుండడంతో తాగిన మైకంలో జానును గొంతు పిసికి చంపేసింది. పాపకు పాము కరిచి చనిపోయిందని గ్రామ స్తులు, బంధువులతో నమ్మబలికింది. శుక్రవారం ఉదయం పాప మృతి చెందిన విషయాన్ని బంధువులకు తెలియడంతో ఇంటికి చేరుకుని బాలిక బట్టలు మార్చుతుండగా గాయాలుతగిలినట్లు గుర్తించారు. ఇది గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. అచ్చంపేట సిఐ రవిందర్ ఆధ్వర్యంలోపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పాపతండ్రి తగిలి తిరుపతయ్య ఇచ్చినఫిర్యాదు మేరకుకేసునమోదుచేసినట్లుఎస్సై జగన్మోహన్ తెలిపారు.

